మనం
మెదక్
సంగారెడ్డి
సిద్దిపేట
గురువారం | 31 | ఆగస్టు | 2023 | పేజీలు : 8




## ఎన్నికల విధుల నిర్వహణకు సన్నద్ధం కావాలి

నియోజకవర్గం వారీగా ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్

2 లో



# అన్నా, చెల్లెళ్ల అనుబంధమే రాఖీ



చిన్నప్పటి నుంచి తమతో కలిసి పెరిగిన సోదరీమణులు పెళ్లి అయ్యి అత్తారింటికి వెళ్ళినప్పటికి అంతే రెట్టింపు ప్రేమానురాగాన్నీ అందించాలనే తత్వానికి రాఖీ నాంది అవుతుంది. రాఖీ పౌర్ణమి రోజున సుదూర ప్రాంతాల్లో ఉన్న పెళ్లయిన ఆడపడచులు తమ పుట్టింటికి వెళ్ళి అన్నా, తమ్ముళ్లకు రాఖీలు కట్టి తమ విశాల అనురాగాన్ని తెలియజేస్తారు. రాఖీ డబ్బు పెట్టి కొనే వస్తువు కాదు. కొలమానం లేని అన్న ప్రేమకు చెల్లెలు కట్టే చిరుకానుకే రాఖీ. వేద

హుస్నాబాద్,ఆగస్టు 30,(మనం న్యూస్): రాఖీ, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంద్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తుంటారు. అన్నా, చెల్లెళ్లు లేదా అక్కా, తమ్ముళ్ళ మధ్యన ప్రేమానురాగాలకు ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. అన్నకు గాని తమ్మునికి గాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రధాన విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా, చెల్లెల్లు, అక్కా, తమ్ముళ్లు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే రాఖీ.



- నేను నీకు రక్ష..నీవు నాకు రక్ష
- అపూరపమైనది అన్నా, చెల్లెలి ప్రేమ
- అన్న ఆశీర్వాదమే చెల్లెకు బహుమానం
- రాఖీ పౌర్ణమికి మరో పేరు జంధ్యాల పౌర్ణమి
- అన్న ప్రేమకు చెల్లెలు కట్టే చిరుకానుకే రాఖీ
- రాఖీ పండుగ పై "మనం" ప్రత్యేక కథనం....

మంత్రాల సాక్షిగా భార్యకు భర్త కట్టే మంగళసూత్రానికి ఎంత పవిత్రత ఉందో అన్నయ్యకు ప్రేమతో చెల్లి కట్టే రాఖీకి కూడా అంతే పవిత్రత ఉంది. నేటి ఆధునిక కాలంలో బంధాలు, బంధుత్వాలు, మానవత్వాలు మరుగున పడుతున్న నేటి కాలంలో ఇంకా రక్త సంబంధపు వెలుగును సోదరీ, సోదరులలో రక్షబంధన్ మహోన్నతంగా నిలుపుతున్నది. అందుకే రాఖీ పౌర్ణమిని చాలా ఉత్సాహంతో

మిగతా 2లో..

# రైతు రుణమాఫీలో సమస్యలు త్వరగా పరిష్కరించాలి

**-లక్ష పైచిలుకు రుణమాఫీ త్వరలోనే ప్రారంభం**

**-సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్**

సిద్దిపేట, ఆగస్టు 30, మనం న్యూస్ ప్రతినిధిః రైతు రుణమాఫీలో ఏర్పడ్డ సమస్యలను బ్యాంకర్లు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో రైతు రుణమాఫీ 2018పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిలీల్లాలో మొత్తం 1, 75, 719 మంది రైతులకు గాను 1360.48 కోట్ల రుణమాఫీ వర్తించనుందని, 99 వేల 999 రూపాయల లోపు ఉన్న 79178 మంది రైతుకు ప్రభుత్వం ఇప్పటి వరకు 409.22 కోట్ల మాఫీ డబ్బులు ఖాతాలో వేయగా 70, 770 మంది రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు 359.09 కోట్లు జమమయ్యాయన్నారు. రైతులకు చెందిన కొన్ని ఖాతాలు క్లోజ్ కావడం వల్ల జమకాలేదని, బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు మాఫీ జాబితాను గ్రామాల వారీగా సరిచేసి డబ్బులు జమకాని రైతుల రుణ ఖాతాలోచి సేవింగ్ ఖాతాలోకి డబ్బులు జమ చేయాలన్నారు. లక్ష పైన ఉన్న రైతు రుణాల మాఫీ ప్రక్రియ త్వరలో ప్రారంభం




కానుందన్నారు. ఈ ప్రక్రియను పరిశీలించేందుకు ఒక నోడల్ అధికారిని నియమించాలని ఎల్‌బిఎం సత్యజిత్‌కు సూచించారు. ఇకపై వారం వారం రైతు రుణమాఫీపై సమీక్షిస్తామన్నారు. రైతులు రుణాలను పొందేందుకు లేదా రెన్యువల్

మిగతా 2లో..

# ప్రేమను పంచే రాఖీల పండుగ

**ఎకో ఫ్రెండ్లీ రాఖీలకు సిద్దిపేట ప్రత్యేకం**

**శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీష్‌రావు**



సిద్దిపేట, ఆగస్టు 30, మనం న్యూస్ ప్రతినిధిః సోదర సోదరీమణులకు ప్రేమను పంచే పండుగ రాఖీల పండుగ అని, ఈ పర్వదినం ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని మంత్రి హరీష్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గం అన్నింటిలో ఆదర్శంగా నిలుస్తుందని, ప్లాస్టిక్‌ను నిర్మూలించే దిశగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, ఏ సందర్భమైనా కొత్తదనానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. మహిళామణులు ప్లాస్టిక్‌తో తయారు చేసిన రాఖీలు కాకుండా సహజసిద్ధంగా ఉండే ఆకులు, పూవులతో ఈ సంవత్సరం ఎకో ఫ్రెండ్లీ రాఖీ కట్టాలని కార్యక్రమానికి మహిళామణులు శ్రీకారం చుట్టి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఇప్పటికే మహిళల్లో చైతన్యం వచ్చిందని, తమ ఆరోగ్యం పట్ల తాము తీసుకుంటున్న శ్రద్ధ, వారు చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

## నేటి నుండి సిటీ పోలీస్ యాక్ట్ అమలు

### సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత



సిద్దిపేట, ఆగస్టు 30, మనం న్యూస్ ప్రతినిధిః సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలో నేటి నుండి సిటి పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుండి సెప్టెంబర్ 9వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటున్నందున కమీషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదనదన్నారు. అవసరమైతే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందించాలన్నారు.

## ముగిసిన మండల స్థాయి పాఠశాల క్రీడలు



నంగునూరు, ఆగస్టు 30, మనం న్యూస్ః స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్ 14, అండర్ 17 బాలబాలికల పాఠశాల స్థాయి వాలీబాల్, ఖో ఖో, కబడ్డీ పోటీలు బుధవారం ముగిసాయి. విజేతలకు మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, మండల విద్యాధికారి దేశిరెడ్డిలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు జిల్లాలో కూడా రాణించాలని, అందుకు తగిన ప్రోత్సాహం, తమవంతు సహాయ సహ కారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేందర్‌రెడ్డి, నాయకులు ఎనగందుల యాదగిరి, నంగునూరు ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రవిందర్ గౌడ్, ఫిజికల డైరెక్టర రాజమౌళి, పిఈటిలు రాజ్‌కుమార్, శ్రీనివాస్, ప్రశాంతి, నరేష్, రాజు, రమేష్, శారద ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీలో సమస్యలు త్వరగా పరిష్కరించాలి




మొదటి పేజీ తరువాయి..

చేసుకునేందుకు ఫోటోలు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో వ్యవసాయ అధికారులు సూచించిన తేదీలలో సోమవారం నుండి గ్రామాల వారీగా బ్యాంక్‌లకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, పిడి మెప్మా హనుమంతరెడ్డి, ఏపిజివిబి రీజనల్ మేనేజర్ ఆశలత, యుబిఐ చీఫ్ మేనేజర్ ఆలం, ఆయా బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల నిర్వహణకు సన్నద్ధం కావాలి

### -నియోజకవర్గం వారీగా ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షించాలి

### -జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్

సిద్దిపేట, ఆగస్టు 30, మనం న్యూస్ ప్రతినిధిః త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల విధుల నిర్వహణకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకొని సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలోని సెక్షన్‌లను, నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసి)ని విజిట్ చేసి ఆయా సెక్షన్‌లలో ఉన్న కంప్యూటర్లు, స్కానర్లు, స్టేషనరీ, ఉద్యోగుల వివరాలు పరిశీలించారు. ఈ సంద





ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి పర్యవేక్షించాల్సి ఉన్నందున ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన సౌకర్యాలను సెక్షన్ల వారీగా సమకూర్చాలన్నారు. ప్రతి సెక్షన్ వద్ద ఎన్నికల విధులు నిర్వహించే అధికారి పేరు, హోదా, విధుల వివరాలు బోర్డుల ద్వారా ఏర్పాటు చేయాలని ఏఈఓ అబ్దుల్ రెహమాన్‌కు సూచించారు. ఎన్ఐసి ద్వారా నిర్వహించే ఎన్నికల విధుల చార్టును రూపొందించి ప్రదర్శించాలని, ప్రజల నుండి వచ్చే సందేహాలకు 1950 నెంబర్ ద్వారా ఫిర్యాదులను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సాంకేతిక సహకారాన్ని పర్యవేక్షించాలని డిస్ట్రిక్ మేనేజర్ ఆనంద్‌ను ఆదేశించారు.

## అన్నా, చెల్లెళ్ల అనుబంధమే రాఖీ

మొదటి పేజీ తరువాయి..

జరుపుకుంటారు. సాధారణంగా జంధ్యాన్ని (జంజరం) ధరించే వారు ఈ రోజునే పాతది వదిలి కొత్త దానిని ధరిస్తారు. ఉపనయనం అయిన వారు జంధ్యాల పౌర్ణమి రోజున గాయత్రీ దేవి పూజ చేసి కొత్త యజ్ఞోపవీతాన్ని ధరించి పాతది తీసివేస్తారు.

**రక్షాబంధన్ ఎలా ప్రారంభమైందంటే......**

పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధం సాగింది. యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు నిర్వీరుడై, తన పరివారమంతటినీ కూడగట్టుకొని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సాహయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. రాక్షస రాజు అమరవాతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకుని భర్త దేవేంద్రుడికి సమరం చేయడానికి ఉత్సాహన్ని కల్పిస్తుంది. సరిగ్గా ఆరోజు శ్రావణ పౌర్ణమి కావడంతో పార్వతీ, పరమేశ్వరులను, లక్ష్మీనారాయణులను పూజించి రక్షాను దేవేంద్రుడి చేతికి కడుతుంది. అది గమనించిన దేవతలందరూ వారు పూజించి రక్షలను తీసుకువచ్చి ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. శచీదేవి ప్రారంభించిన ఆ రక్షాబంధనమే నేడు రాఖీ పండుగగా మనం జరుపుకుంటున్నామని పురాణాలు చెబుతున్నాయి. శ్రీ మహా విష్ణువు బలి చక్రవర్తి కోరిక మేరకు అతనితో పాటు పాతాళంలో ఉండిపోతాడు. శ్రీమహాలక్ష్మీ వెళ్లి బలి చక్రవర్తికి రక్షాబంధం కట్టి, తన భర్తను వైకుంఠానికి తీసుకొనిపోతుంది. అందుకే రక్షాబంధానికి ఇంత ప్రాధాన్యత ఏర్పడింది.

**చరిత్ర చెబుతున్నదేమిటి....................**

పురాణాలు, ప్రాచీన గ్రంథాలలోనే కాదు. రాఖీ సంప్రదాయం మన చరిత్రలో సజీవంగా సాక్ష్యరిస్తుంది. అలెగ్జాండర్ దేశం మీదకు దండెత్తి వచ్చినప్పుడు, అతడిని తక్షశిల రాజు పురుషోత్తముడు నిలువరించాడు. పురుషోత్తముని చేతిలో తన భర్త హతం అవుతాడనే భయంతో, అలెగ్జాండర్ భార్య రోక్సానా పురుషోత్తముని పతిభిక్ష పెట్టమని వేడుకుంటూ రాఖీ పంపిందట. మొఘల్ పాలనలో చిత్తోడ్ రాజ్యాన్ని ఏలుతున్న కర్నావతి అనే రాణి కూడా అప్పటి మొఘల్ చక్రవర్తి హుమాయున్కి రాఖీని పంపిందని చరిత్ర చెబుతుంది. ఇక రవీంద్రనాథ్ ఠాగూర్ సైతం స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు రక్షాబంధాన్ని ప్రోత్సహించారట.

**రాఖీ కట్టే విధానం..............................................**

రాఖీ పౌర్ణమి రోజు మహిళలు వారి సోదరుల ఇంటికి వెళ్తారు. ముందుగా తమ సోదరుడికి కుంకుమ బొట్టు పెట్టాలి. కుంకుమ బొట్టు పెట్టిన తర్వాత తల పై అక్షింతలు వేయడం అనవాయితీ.

రాఖీ కట్టే ముందు

''యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహబలః''
''తేన త్వామభి బద్నామి రక్ష మాచల మాచల''

అనే శ్లోకాన్ని చదివి రాఖీ కడతారు. రాఖీ కట్టిన తర్వాత తమ సోదరుడిని ఆశీర్వదిస్తూ అక్షింతలు వేయాలి. రాఖీ కట్టిన తర్వాత సోదరీ హారతి ఇస్తారు. ఆనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటారు.


**పలు విధాలుగా శ్రావణ పౌర్ణమి.........................**

- శ్రావణపౌర్ణమి రోజు కేవలం రాఖీ మాత్రమే కాదు ఇతరత్రా ప్రత్యేకతలు కూడా ఆచరిస్తారు. జంధ్యం అనవాయితీ ఉన్న వారు నూతన జంధ్యాన్ని (జంజరం) ధరిస్తారు. అందుకనే దీన్ని జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. ఈ రోజున హయగ్రీవ జయంతిని కూడ జరుపుకుంటారు. బెంగాల్ రాష్ట్రంలో ఝూలన్ పౌర్ణమి పేరుతో రాధాకృష్ణుల విగ్రహలను ఊయలలో ఉంచి ఊరేగిస్తారు. ఉత్తరాది రాష్ట్రాల్లో 'కజరి పౌర్ణమి' పేరుతో గోదుమ నాట్లు వేస్తారు. సముద్ర తీరంలో ఉండే వారు 'నరాళీ పౌర్ణమి పేరుతో సముద్ర దేవుడికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. శ్రావణ పౌర్ణమి రోజున ఎన్ని ఆచారాలు ఉన్న, రక్షాబంధనానికే తొలి ప్రాధాన్యం.

## తండ్రి అక్రమ సంబంధం నేపథ్యంలో తండ్రి, కుమారుల మధ్య ఘర్షణ

### ప్రమాదవశాత్తు తలకు గాయమై తండ్రి మృతి

దుబ్బాక, ఆగస్టు 30, మనం న్యూస్ః పరాయి మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న తండ్రిని వద్దని వారించగా జరిగిన గొడవలో కొడుకు తండ్రిని బలంగా నెట్టివేయగా తలకు బలమైన గాయం తగిలి తండ్రి మృతి చెందిన సంఘటన దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చింతల తిరుపతి (50) గ్రామంలో వ్యాపారంతోపాటు ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. ఇతనికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన దేవవ్వ అనే మహిళతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్న తిరుపతిని కుటుంబీకులు వద్దని వారించడంతో తరుచుగా కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటి వద్ద కుమారులు, భార్యతో తిరుపతికి గొడవ జరగగా, కుమారుడు గణేష్ తిరుపతిని నెట్టి వేయగా పక్కన ఉన్న స్టీల్ ర్యాంప్‌పై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే తిరుపతిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.



మృతుని భార్య ఐలవ్వ, ఇద్దరు కుమారులు గణేష్, శివాజీలపై మృతుని సోదరుడు రాజలింగం ఫిర్యాదు మేరకు కేస నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# పోతిరెడ్డిపల్లిలో పౌర హక్కుల దినోత్సవం



చేర్యాల, ఆగస్టు 30, మనం న్యూస్‌: చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఎస్సీ కాలనీలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కత్తుల కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి తహసీల్దార్ రాజేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. పౌర హక్కులకు భంగం కలగకుండా కాపాడుకోవాలన్నారు. అంతేకాకుండా కులమత వర్గ భేదం లేకుండా అందరూ కలిసికట్టుగా జీవించాలన్నారు. మూఢనమ్మకాలను నమ్మకూడదని సూచించారు. గతంలో గుడిలో, బడిలో అంటరానితనం ఎక్కువగా ఉండేదని, నీళ్లు కూడా తాగనిచ్చేవారు కాదన్నారు. అందరూ కలిసికట్టుగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు తహసీల్దార్‌కు కత్తుల భాస్కర్‌రెడ్డి ధన్యవాదాలు తెలుపగా గ్రామస్తులతో కలిసి తహసీల్దార్‌కు అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి పల్లె రజిత, ఎంపిటిసి గూడూరు బాలరాజు, కత్తుల భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ గూడెల్లి మాధవి, వార్డు మెంబర్లు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

## జేఏసి ఛైర్మన్ రామగల్ల పరమేశ్వర్



చేర్యాల, ఆగస్టు 30, మనం న్యూస్‌: చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకై సెప్టెంబర్ 2న జరిగే విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని జేఏసి ఛైర్మన్ డా. రామగల్ల పరమేశ్వర్ కోరారు. బుధవారం చేర్యాల మండలంలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల హెచ్ ఎం., ప్రిన్సిపల్‌లకు విజ్ఞాపన పత్రాలను జేఏసి నేతలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని అన్ని రాజకీయ పార్టీలు జేఏసిగా ఏర్పడి అనేక ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నాయని, ఇంత ఉద్యమం జరుగుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరికైన రెవెన్యూ డివిజన్ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి నియోజకవర్గ నాయకులు అందె అశోక్, మంచాల చిరంజీవులు, బిజ్జ రాములు, చంద శ్రీకాంత్, బుట్టి సత్యనారాయణ, బుట్టి బిక్షపతి, పుట్ట రాజు , ఆముదాల రంజిత్‌రెడ్డి, కత్తుల భాస్కర్‌రెడ్డి, ఏగుర్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాన్గల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎండి. బషీరుద్దీన్



తొగుట, ఆగస్టు 30, మనం న్యూస్‌: తొగుట మండలం కాన్గల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎండి. బషీరుద్దీన్ ఎన్నికయ్యారు. దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు కాన్గల్ గ్రామంలో పార్టీ కమిటీ వేసినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బషీరుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు. ఉపాధ్యక్షులుగా మరుపల్లి స్వామి గౌడ్, మాదారం చిన్న మల్లయ్య, సలహాదారులుగా సత్యంచారి, షఫీ ఉద్దీన్, సర్వం బిక్షపతి, మంచర్ల వెంకటరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ కమిటీ అధ్యక్షులుగా నాయిని మహేష్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె. చాంద్‌బి, శ్రీరామ్, కోశాధికారిగా పిట్ల నరేష్, ప్రధాన కార్యదర్శిగా ఎండి. సలీం, ప్రచార కమిటీ అధ్యక్షులుగా పిట్ల నగేష్, బూత్ అధ్యక్షులుగా బి. ఎలంధర్‌రెడ్డి, పిట్ల శ్రీకాంత్, ఎస్సీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షులు బత్తుల యాదయ్య, ఉపాధ్యక్షులుగా మాదారం అర్జున్, నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా మాదారం నర్సయ్య, సోషల్ మీడియా అధ్యక్షులుగా సోమగారి హనుమంతరెడ్డి, పిట్ల కుమార్, బిసి సెల్ అధ్యక్షులుగా రేపాక నరసింహులు, ఉపాధ్యక్షులుగా పిట్ల కుమార్, ప్రధాన కార్యదర్శిగా పోతురాజు నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసి పిట్ల సత్తయ్య, తొగుట మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు స్వామి యాదవ్, మాజీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఎస్. కొండల్‌రెడ్డి, షఫీ ఉద్దీన్, సత్యంచారి, ఎస్. అంజిరెడ్డి, కిష్టారెడ్డి, నాయిని యాదగిరి, గిరి శ్రీనివాస్‌రెడ్డి, దేశిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి




చేర్యాల, ఆగస్టు 30, మనం న్యూస్‌: చేర్యాల, మద్దూరు, దూళ్మిట్ట, కొమురవెల్లి మండలాలను కలుపుతూ చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నేటికి మూడవ రోజుకు చేరుకున్నాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూమిగారి మనోహర్, బీజేపీ రాష్ట్ర నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి తదితరులు దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు చేర్యాలను రెవెన్యూడివిజన్‌గా ప్రకటించాలని కోరారు.




# బాధిత కుటుంబానికి బియ్యం అందించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు

తొగుట, ఆగస్టు 30, మనం న్యూస్‌: తొగుట మండల కేంద్రంలో ఇటీవల చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన తొగుట గ్రామానికి చెందిన దాకాని స్వామి కుటుంబ సభ్యులను తొగుట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఉల్లెంగల సాయికుమార్ ముదిరాజ్ బుధవారం పరామర్శించి వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు. స్వామి మరణం వారి కుటుంబానికి తీరని లోటని, కుటుంబ సభ్యులు మనోధైర్యం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు అనిమెల్ల బాల్‌నర్సయ్య, ప్రధాన కార్యదర్శి చెరుకు నరేష్‌రెడ్డి, కార్యదర్శి జూపల్లి నర్సింలు, జాయింట్ సెక్రటరీ లింగాల మహేష్, సభ్యులు అల్వాల కృష్ణ, గంద్యాల నర్సింలు, మాదాసు నాగార్జున, షఫీతోపాటు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 2న జిల్లా యోగాసన పోటీలు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 30, మనం న్యూస్‌: జిలా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ సిద్దిపేట కోమటి చెరువు సమీపంలోని చంద్రమౌళి గార్డెన్స్‌లో ఉదయం 9 గంటల నుండి పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. 9 -14 ఏళ్ల వారికి సబ్ జూనియర్, 14-18 ఏళ్ల వారికి జూనియర్, 18-28 ఏళ్ల వారికి సీనియర్, 28-35, 35-45, 45-55 ఏళ్ల వారికి మూడు విభాగాల్లో మాస్టర్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించడం జరుగుతాయని ట్రెడిషనల్ యోగాసన ఆర్టిస్టిక్ యోగాసన, రిథమిక్ యోగాసన విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు తమ వయసుధృవీకరణ పత్రాం, బోనఫైడ్‌తోపాటు ఫోటోను సమర్పించాలని తెలిపారు. ప్రతి విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 63022 27030, 91601 39889, 90001 90589 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# గొల్ల కుర్మలను మోసం చేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వం



కొండపాక, ఆగస్టు 30, మనం న్యూస్‌: గొల్లకురుమలకు సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేస్తామని చెప్పి డిడిలు కట్టించుకొని ఆరు నెలలు గడుస్తున్నా గొర్రెలను పంపిణీ చేయకుండా గొల్లకురుమలను బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందని కొండపాక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసరి లింగారావు అన్నారు. బుధవారం వెలికట్ట చౌరస్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్సిడీపై గొర్రెలు వస్తాయని గొల్లకురుమ సోదరులు అప్పులు తెచ్చిమరీ డిడిలు తీశారని, ఆరునెలలు గడుస్తున్నా గొర్రెలు రాకపోవడంతో గొల్లకురుమలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేయడం ఆయన నైజమని ఆరోపించారు. కాంగ్రెస్ తోనే రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే గొల్లకురుమలకు గొర్రెలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్ల ఆంజనేయులు, సిద్దులు, భాను ప్రకాష్, సతీష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పరిశుభ్రతకు సహకరించండి

## మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 30, మనం న్యూస్‌: పట్టణ ప్రజలందరూ తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు అన్నారు. నడుస్తూ చెత్తను ఏరివేద్దాం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 31వ వార్డులో కౌన్సిలర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ కమీషనర్ సంపత్ కుమార్‌తో కలిసి వార్డులో తిరుగుతూ చెత్తను ఏరివేశారు. ఈ సందర్భంగా వార్డులోని కిరాణ, హోటళ్లు ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టిక్ వినియోగించరాదని సూచించారు. చెత్తను మూడు రకాలుగా వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే చెత్త వాహనానికి అందించాలని కోరారు. అనంతరం 37వ వార్డులోని ఎల్లయ్య అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మరణించగా సమాచారం తెలుసుకున్న రాజనర్సు వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. 16వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గుర్రం శ్రీనివాస్ నిన్న రాత్రి గుండెపోటుతో మరణించగా వారి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.

# పదేండ్లు గడుస్తున్నా 'గౌరవెల్లి' పూర్తి కాలే



- ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వలే
- విమర్శకు ప్రతి విమర్శ సరికాదు
- సిపిఐతో కాంగ్రెస్‌కు అలవెన్సు అంటూ దుష్ప్రచారం
- శనిగరంను టూరిజం ప్రాంతంగా ఎందుకు చేయలేదు
- కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్ గౌడ్





కోహెడ,ఆగస్టు 30,(మనం న్యూస్)ః పదేండ్లు గడుస్తున్నా 'గౌరవెల్లి' ప్రాజెక్టును పూర్తి చేయలేని అసమర్థుడు ఎమ్మెల్యే అని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్ విమర్శించారు. మండలంలోని నకిరేకొమ్ముల గ్రామంలో గ్రామ గ్రామాన కాంగ్రెస్...గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. ఆనంతరం పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ హామీలు ఏమీ అమలు కాలేదన్నారు. ఇక్కడి శాసనసభ్యుడు కాళ్లు మొక్కించుకోవడానికి మాత్రమే పరిమితం అవుతున్నాడని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలో ఏ పేదవాడికి డబుల్ బెడ్‌రూమ్ కట్టివ్వలేని అసమర్థుడు ఎమ్మెల్యే అని పొన్నం అన్నారు. ఎమ్మెల్యే దత్తత తీసుకున్న మైసంపల్లి గ్రామం ఏమి అభివృద్ధి చెందిందో చర్చకు రావాలన్నారు. శనిగరంలో డబుల్ బెడ్‌రూమ్‌లకు శంకుస్థాపన చేసినప్పటికి నిర్మాణాలు జరగలేదని ఇప్పటికి ఏ ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. శనిగరం ప్రాజెక్టును టూరిజం ప్రాంతం చేయగలిగే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు చేయలేదన్నారు. పక్కన సిద్దిపేటలో కోమటిచెరువు కంటే ఎక్కువ అభివృద్ధి చేయగలిగే శనిగరం ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. సమస్యలు పరిష్కరించమని అడిగితే వాళ్లకు సంబంధించిన నాయకులు సమాధానం ఇవ్వడం హస్యాస్పదం అన్నారు. కాలువలు నిర్మాణం చేస్తాడు మా అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే అని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారంటే ఈ పది ఏండ్లలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయలేదని ఒప్పుకున్నట్టేనా అంటూ ఆయన ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వమే 80 శాతం పనులను పూర్తి చేసిందన్నారు. పదేండ్లు గడుస్తున్నా గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయలేని ఎమ్మెల్యే రైతులకు, ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. సిద్దిపేటలో హుస్నాబాద్‌ను కలిపినపుడు ఎందుకు ఆపలేదన్నారు. 2018 ఎన్నికల మాదిరిగా తెరచాటు రాజకీయం చేస్తూ సిపిఐతో కాంగ్రెస్‌కు అలవెన్సు అవుతుందంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్యకర్తలు, ప్రజలకు చెబుతున్నాను హుస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందన్నారు. సిపిఐ అంటే అగౌరవం లేకున్నా ఇక్కడి రాజకీయ పరిస్థితులను అధిష్టానంకు వివరిస్తామన్నారు. కాంగ్రెస్ హామీలను కార్యకర్తలు గడప గడపకు ప్రచారం చేసి కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలన్నారు. ఆనంతరం తంగళ్ళపల్లి గ్రామంలోని బండిపల్లి నారాయణ, ఆర్యనపల్లి ముని కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బండిపల్లి నారాయణగౌడ్, ఉపాధ్యక్షుడు బస్వరాజు శంకర్, చిగురుమామిడి మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, అక్కనపేట మండల అధ్యక్షుడు జంగపెల్లి ఐలయ్య, మాజీ జడ్పీటీసీ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు భీంరెడ్డి మల్లారెడ్డి, గొరిట్యాల లక్ష్మణ్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ జయరాజు, నాయకులు వెన్న రాజు, అబ్దుల్ రఫీ, గాజుల రవీందర్, దూలం శ్రీనివాస్‌గౌడ్, రాచూరి శ్రీనివాస్, తదితరులున్నారు.

పేదలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ రావాలి

**– మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి**

పేదలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతుందన్నారు. పేదలను పట్టించుకోని కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గుడిసేల్లో నివసించే వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, పింఛన్ రూ.4 వేలు ఎస్సీ, రైతు డిక్లరేషన్‌లను అమలు చేస్తామన్నారు.

## యోగా శిక్షకులు సతీష్‌కు జాతీయ అవార్డు

### అభినందనలు తెలిపిన పలువురు ప్రముఖులు



సిద్దిపేట, ఆగస్టు 30, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ యోగా శిక్షకులు తోట సతీష్‌ను 2023 సంవత్సరానికి గాను జాతీయ బెస్ట్ టెక్నికల్ అఫీషియల్ అవార్డు వరించింది. యోగాసన భారత్ అధ్యక్షులు ఉదిత్ సేథ్, ప్రధాన కార్యదర్శి డా. జయదీప్ ఆర్యలు బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు రాష్ట్రాల నుండి తోట సతీష్‌కు ఈ అవకాశం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. గత సంవత్సరం జాతీయ క్రీడలకు, ఖేలో ఇండియా గేమ్స్, ఫెడరేషన్ గేమ్స్‌లలో టెక్నికల్ అఫీషియల్‌గా విధులు సమర్ధవంతంగా నిర్వహించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. బాల్యంలోనే యోగ సాధనతోపాటు రాటుతేలి జాతీయ స్థాయియోగా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మెడల్‌తో మెరిశాడు. గత రెండు దశాబ్ధాల నుండి నిరంతరంగా యోగా శిక్షణ తరగతులను సిద్దిపేట జిల్లా కేంద్రంగా నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలోనూ ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా ఖండాల్లోని వేలాదిమందికి భారతీయ యోగా శిక్షణను అందించారు.

**–తోట సతీష్‌కు అభినందనల వెల్లువ**

సిద్దిపేటకు చెందిన యోగా శిక్షకులు తోట సతీష్‌కు జాతీయ స్థాయి అవార్డు రావడం పట్ల వివిధ వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, వైస్ ప్రెసిడెంట్ రామచంద్రం, జాయింట్ సెక్రటరీ రాంరెడ్డిలు సతీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తోట సతీష్‌కు తగిన గుర్తింపు లభించిందని మంత్రి హరీష్‌రావు, జెడ్పి ఛైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ ఛైర్మన్ మంజుల రాజనర్సుతోపాటు పలువురు తోట సతీష్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు పొందాలని, యోగ విద్యతో సమాజాన్ని ఆరోగ్యవంతం చేయాలని ఆకాంక్షించారు.



## సెప్టెంబర్ 2న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలి

### జేఏసి నాయకులు ఆలేటి యాదగిరి

మద్దూరు, ఆగస్టు 30, మనం న్యూస్ః చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ సెప్టెంబర్ 2వ తేదీన నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని జేఏసి నాయకులు ఆలేటి యాదగిరి కోరారు. బుధవారం మద్దూరు మండల జేఏసి వైస్ ఛైర్మన్ రామడుగు బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో వైభవోపేతంగా ఉన్న చేర్యాల ప్రాంతం పాలకుల తీరు వల్ల నేడు ఉనికిని కోల్పోయిందని, పాలకవర్గాలు వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప ప్రజా ప్రయోజనాలను పట్టించుకోకుండా గాలికి వదిలేసారన్నారు. దీంతో ఈ ప్రాంతం ఉనికి కోల్పోతూ వస్తుందని, ఎంతో గొప్ప చరిత్ర కలిగిన చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకుండా సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావులు ఈ ప్రాంతంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత యువకులు, విద్యార్థులు, మేధావులు రాజకీయాలకు అతీతంగా రెవెన్యూ డివిజన్ సాధించే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలక చందు, రాజు, బియ్య రమేష్, దాసు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆపద్బాంధవుడు ముత్తిరెడ్డి

### పేదింటి ఆడపిల్ల ఉన్నత చదువులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మద్దూరు, ఆగస్టు 30, మనం న్యూస్ః నిరుపేదల ఆపద్బాంధవుడిగా నిత్యం ప్రజా సేవలో తన మార్కును చూపిస్తున్న జనగామ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే యాదగిరి రెడ్డి పేదల పట్ల తన ధాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. దూల్మిట్ట మండలం కూటిగల్ రెడ్యానాయక్ తండా గ్రామానికి చెందిన ధరావత్ శిల్ప ఇంజనీరింగ్ చదువుకై ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి శిల్పకు ఇంజనీరింగ్ చదువు నిమిత్తం తన సొంత డబ్బులు రూ. 30 వేలు అందించారు. ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ తన పై చదువుల కోసం ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి అడిగిన వెంటనే స్పందించి ఆదుకోవడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన దూల్మిట్ట మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు మంద యాదగిరి, గ్రామ సర్పంచ్ శివలాల్, ఎమ్మెల్యే యాదగిరిరెడ్డిలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాన్నారు. ఇలాంటి ప్రజా నాయకుడిని జనగామ ప్రజలు మరోసారి గెలిపించుకొని మంత్రిని చేసుకుందామని ఆమె పిలుపునిచ్చారు.

## సోదర సోదరీమణుల ప్రేమకు ప్రతీక రక్షాబంధన్

### ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి



సిద్దిపేట రూరల్, ఆగస్టు 30, మనం న్యూస్ః ప్రేమకు, అనురాగానికి ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందని ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి, ఎంఈఓ యాదవరెడ్డిలు అన్నారు. ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా శాఖ ఆద్వర్యంలో పట్టణంలోని కాకతీయ టెక్నో స్కూల్‌లో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, ఎంఈఓ యాదవరెడ్డిలు హాజరై మాట్లాడారు. అన్నా చెల్లెళ్ళ, అన్నదమ్ముల ప్రేమకు, అనురాగానికి ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో ఒకరికి ఒకరు తోడుగా నిలిచి, సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నీవు నాకు రక్ష నేనే నీకు రక్ష మనందరం దేశానికి రక్ష అనే నినాదంతో సోదర సోదరీమణులు మెలగాలన్నారు. సమాజం మనకేమిచ్చిందని కాకుండా, సమాజానికి మనమేం ఇచ్చామని ప్రతి పౌరుడు గుర్తెరిగి సమాజ దిశా నిర్ధేశకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# రోడ్డు డివైడర్ నిర్మాణం నాణ్యతతో చేపట్టాలి

### -ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్

### -ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపిపి గజ్జల సాయిలు



మిరుదొడ్డి, ఆగస్టు 30, మనం న్యూస్ః మిరుదొడ్డి మండల కేంద్రంలో డివైడర్ల నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని ఎంపిపి గజ్జల సాయిలు అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో నడుస్తున్న డివైడర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులు నిర్మాణ పనుల వద్ద ఉండి పనులు నాణ్యతతో చేయించాల్సినప్పటికీ అధికారులు లేకపోవడం సరికాదన్నారు. కాంట్రాక్టర్ తమకు ఇష్టం వచ్చిన రీతిలో కూలీలను పెట్టి నాణ్యత లేకుండా పనులు చేపట్టడం జరుగుతుందని




మండిపడ్డారు. రోడ్డుకు ఇరు వైపులా పనులు జరుగుతున్నప్పటికీ రోడ్డుపై ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్‌కు ఇష్టం వచ్చిన రీతిలో రోడ్డుపై ఇసుక, కంకర కుప్పలు పోయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, గ్రామస్తులు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ నుండి కొత్త హనుమాన్ దేవాలయం వరకు డివైడర్ నిర్మాణంలో భాగంగా రోడ్డుపై పోసిన ఇసుక,కంకర, రాయి వెంటనే శుభపరిచి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. సంబంధిత అధికారులు నిర్మాణం నాణ్యతతో చేపట్టేలా దగ్గరుండి చూడాలని కోరారు. ప్రభుత్వం లక్షలు వచ్చించి డివైడర్ల నిర్మాణం చేపడుతుంటే కాంట్రాక్టర్ మాత్రం తమకు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# తహసీల్దార్‌ను సన్మానించిన ప్రజాప్రతినిధులు



మిరుదొడ్డి, ఆగస్టు 30, మనం న్యూస్ః మిరుదొడ్డి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా వచ్చిన ఎంఆర్ఓ గోవర్ధన్‌ను మిరుదొడ్డి మండల ప్రజాప్రతి నిధులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ప్రజలకు రెవెన్యూ పరమైన సేవలను అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. సన్మానించిన వారిలో ఎంపిపి గజ్జల సాయిలు, వైస్ ఎంపిపి పోలీస్ రాజులు, తెరాస జిల్లా నాయకులు లింగం, ధర్మారం మల్లయ్య, ప్రతాప్, గొట్టం రాధాకృష్ణ, శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.




## నిబంధనలను తుంగలో తొక్కి వెంచర్ ఏర్పాటు

### అమాయకులను దోచుకుంటున్నారని గ్రామస్తుల ఆవేదన

మిరుదొడ్డి, ఆగస్టు 30, మనం న్యూస్ః మండల కేంద్రంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ వెంచర్లను బడా బాబులు ఏర్పాటు చేయడం జరిగింది. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేసి నిబంధనలను తుంగలో తొక్కి వెంచర్లను ఏర్పాటు చేసి అమాయక ప్రజల నుండి రియల్టర్లు డబ్బులు దోచుకోవడం జరుగుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మంల కేంద్రంలోని సినిమా టాకీస్ స్థలంలో బడాబాబులు ఎలాంటి అనుమతి తీసుకోకుండా వెంచర్ వేసి ప్లాట్లను అమ్మకానికి పెట్టడం జరిగింది. అయినప్పటికీ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో నూతన ఇల్లు నిర్మించాలనుకుంటే అనుమతి తప్పనిసరి అని చెప్పే అధికారులు బడాబాబులకు కొమ్ము కాస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎలాంటి అనుమతి లేని వెంచర్‌ను తొలగించాలని అధికారులను కోరారు. ఇట్టి విషయంపై పంచాయతీ కార్యదర్శి ఫయీమ్‌ను వివరణ కోరగా ఈ వెంచర్‌కు ఎలాంటి అనుమతులు లేవని తేల్చి చెప్పారు. అనుమతులు లేకుండా ప్లాటింగ్ చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



# పేద ప్రజల సంక్షేమానికి బీజేపి కృషి

### -గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపుతో 33 కోట్ల మందికి లబ్ధి

### -ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

### -బీజేపి అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి

దుబ్బాక టౌన్, ఆగస్టు 30, మనం న్యూస్ః అట్టుడుగు స్థాయిన ఉన్న పేదవారికి సైతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే భారతీయ జనతా పార్టీ ప్రథమ లక్ష్యమని బీజేపి దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి అన్నారు. పేద మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ. 200లు, ఉజ్వల యోజన పథకం ద్వారా లబ్ధి పొందే వారికి రూ. 400లు తగ్గించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల ఎస్ఎన్‌చారి ఆధ్వర్యంలో బీజేపి శ్రేణులు బుధవారం ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఖీ పండుగ సందర్భంగా భారత దేశంలోని అక్కాచెల్లెలందరికీ రక్షాబంధన్ కానుకగా ప్రధాని మోదీ గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. దీని ద్వారా దేశంలోని 33 కోట్ల మందికి లబ్ధి చేకూరనుందన్నారు. ప్రతి పేద వాడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్నదే బీజేపి లక్ష్యమన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు కృషి చేస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బీజేపి జెండా ఎగురడం ఖాయమన్నారు.




దుబ్బాక నియోజకవర్గంలో, రాష్ట్రంలో బీజేపి జెండా ఎగురడం ఖాయమని, ఇందుకు కార్యకర్తలంతా కంకణబద్ధులై పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణమహిళా నాయకురాలు ఎంగారి నవ్య, నాయకులు సుంకు ప్రవీణ్, గాజుల భాస్కర్, తొగుట రవిందర్, మచ్చ శ్రీనివాస్, కిష్టమ్మగారి రమేష్‌రెడ్డి, మల్లుగారి రమణారెడ్డి, పుట్ట వంశీ, నిహాల్ గౌడ్, భాను ప్రసాద్, శ్రీకాంత్, బాచి, సంజీవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపిలో చేరిన వార్డు మెంబర్ రాజేశ్వరి

## పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే

దౌల్తాబాద్, ఆగస్టు 30, మనం న్యూస్: దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ నాలుగవ వార్డు మెంబర్ రాజేశ్వరి గణేష్ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బుధవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపిలో చేరారు. బుధవారం దౌల్తాబాద్ మండల కురుమ సంఘం అధ్యక్షులు కురుమ గణేష్,





దౌల్తాబాద్ గ్రామపంచాయతీ వార్డు మెంబర్ రాజేశ్వరి గణేష్ బీజేపిలో చేరగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేరఘునందన్‌రావును మరోసారి గెలిపించుకుంటామని, ఇందుకు తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు. త్వరలో మరింత మంది బీజేపిలో చేరడం ఖాయమని, దుబ్బాక గడ్డపై వచ్చే ఎన్నికల్లో ఎగిరేది బీజేపి జెండాయే అన్నారు.



## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

-కాంగ్రెస్‌లో చేరిన కానుకుంట మాజీ సర్పంచ్

-పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కాట శ్రీనివాస్ గౌడ్

గుమ్మడిదల, ఆగస్టు 30, మనం న్యూస్: కానుకుంట మాజీ సర్పంచ్ పోతురాజు రేణుక, వారి బృందం 50 మందితో కలిసి బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ, ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం సెప్టెంబర్ 3న జరగబోయే శ్రీ పోచమ్మతల్లి బోనాల మహోత్సవానికి, కెవిఎస్‌జి యువసేన ఆధ్వర్యంలో తొట్టెలు ఊరేగింపు కార్యక్రమానికి గ్రామస్తులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ నీలమ్మ, గ్రామ అధ్యక్షులు అంజాద్, సుధాకర్, యాదయ్య, కె. రమేష్, ఎల్. రాజు, ప్రేమ్‌కుమార్, టి. రాజు, గ్రామస్తులు, కేవిఎస్‌జి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవ తీర్మానాలన్నీ బోగస్

## డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్



సిద్దిపేట, ఆగస్టు 30, మనం న్యూస్ ప్రతినిధి: ఓడిపోతామనే భయంతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి బోగస్ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారని డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల నుండి మామ, అల్లుళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని, ఈసారి ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. మంత్రి హరీష్‌రావుకు ఓటమి భయంతోనే లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారన్నారు. ఈ తీర్మానాలలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులే ఉంటున్నారు తప్ప పూర్తిగా సంఘాలకు సంబంధం లేదన్నారు. అభ్యర్థిని చూసి ఓట్లేస్తే మరి బోగస్ ఏకగ్రీవ తీర్మానాలేంటి అని ప్రశ్నించారు. తెలంగాణ నినాదం పేరుతో దోచుకున్నారే తప్ప చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ప్రజలకు లబ్ధి చేకూరిందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూరు మండల అధ్యక్షులు మీసం మహేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జయంత్, నాయకులు కనకయ్య, పర్శరాములు, ప్రశాంత్, వేణు, మహేందర్, బాబు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ ప్లాంట్ సందర్శించిన యునిసెఫ్ బృందం




గజ్వేల్, ఆగస్టు 30, మనం న్యూస్: యునిసెఫ్‌కు చెందిన ముగ్గురు సభ్యులు రాధిక శ్రీవాస్తవ్, వెంకటేష్ అలాపర్తి, రాఘవ్ అరోరాల బృందం బుధవారం మిషన్ భగీరథ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రాజెక్టు ఇంజనీర్ శ్రీనివాసచారి, కార్య నిర్వాహక ఇంజనీర్ రాజయ్య ప్లాంట్ ఉద్దేశం, రూపకల్పన, వాటి పనితీరు, నీటి సరఫరా, నీటి స్వచ్ఛత, అమలుచేసే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంట్రా డిఈఈ సుమలత, గ్రిడ్ డిఈఈ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

తపస్ జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి



సిద్దిపేట రూరల్, ఆగస్టు 30, మనం న్యూస్: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తపస్ జిల్లా అధ్యక్షులు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాత్కాలిక, ఒప్పంద ఉద్యోగులు ఎవరూ ఉండొద్దని, అందరినీ శాశ్వత ఉద్యోగులుగా నియమిస్తామని తెలిపిన ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష 3వ రోజు శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడుతూ 9 ఏళ్ల పూర్తయినా హామీ నెరవేర్చడంలో జాప్యం చేయడం తగదన్నారు. గత 15 ఏళ్ల నుండి చాలీ చాలని జీతాలతో వారి కుటుంబాలు నెట్టుకొస్తున్నారన్నారు. బంగారు తెలంగాణలో సీఎం వెంటనే స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారి తరుపున పోరాడుతూ నిర్వహించే ప్రతి ఆందోళన కార్యక్రమంలో వెంట నిలుస్తామని భరోసానిచ్చారు.

# ముదిరాజ్ సామాజిక వర్గానికి సీటు కేటాయించకపోవడం కేసీఆర్ నిర్లక్ష్యం

## సబ్బండ వర్గాల మద్దతు నీలం మధుకే

పటాన్‌చెరు, ఆగస్టు 30, మనం న్యూస్: ముఖ్యమంత్రి కేసీఆర్ నీలం మధు ముదిరాజ్‌కు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఒక్క అవకాశం ఇస్తే ఇంటికో సైనికుడిలా పని చేసి గెలిపించుకుంటామని రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ సంఘాల నాయకులు, సబ్బండ వర్గాల ప్రజలు, యువత కోరుతున్నారు. సీఎం కేసీఆర్



ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో బిసి వర్గాలకు తగిన స్థానం కల్పించకపోవడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో కీలకమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి ఒక్క సీటు కేటాయించకుండా కేసీఆర్ నిర్లక్ష్యం చేయడంపై బిసి వర్గాలు గొంతెత్తుతున్నాయి. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో అనునిత్యం ప్రజా సేవ చేయడంతోపాటు బిఆర్ఎస్ పార్టీ కోసం తీవ్రంగా కష్టపడ్డ నీలం మధు ముదిరాజ్‌కు టికెట్ విస్మరించడం సరికాదన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తికి బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వడం ద్వారా పటాన్‌చెరు నియోజకవర్గమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆ ప్రభావం ఉంటుందని తేల్చి చెప్తున్నారు. సబ్బండ వర్గాల ప్రజల ప్రతినిధిగా నీలం మధు అసెంబ్లీకి వెళ్తే బడుగు బలహీన వర్గాల ప్రజలకు తప్పక న్యాయం జరుగుతుందని గట్టిగా నమ్ముతున్నారు. ఇంటికొక్కరు ముందుకు వచ్చి బహుజన వాదాన్నివిరివిగా ప్రజల్లోకి తీసుకువెళ్లి నీలం మధు ముదిరాజ్‌ను గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నీలం మధుకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా బిసి వర్గాలు, సబ్బండ వర్గాల ప్రజలు రోజు వారీగా నీలం మధును కలిసి సంఘీభావం తెలుపుతున్నారు. అంతకు రెట్టింపు స్థాయిలో ఫోన్‌ల ద్వారా సమాచారం ఇస్తూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి తామంతా వచ్చి వెన్నుదన్నుగా నిలబడి ఇంటింటికి ప్రచారం చేసి గెలిపిస్తామంటున్నారు. పార్టీల అభ్యర్థులకు గల్లీకొక ఇంచార్జ్ ఉంటే ఇంటికో ఇంచార్జ్‌గా ఉండి నీలం మధును గెలిపిస్తామని భరోసా ఇస్తున్నారు. రాష్ట్రం



నలు మూలల నుండి సబ్బండ వర్గాల నుండి వస్తున్న మద్దతుకు అనుగుణంగా నీలం మధు తన కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు తన సన్నిహితులు, అభిమానుల ద్వారా క్షేత్ర స్థాయిలోని పరిస్థితులను తెలుసుకుంటున్నారు.

# మాదారంలో వేళా పాళా లేని విద్యుత్ కోతలు

**-కరెంటు సమస్యంతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు**

**-జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కలాల్ రాజు గౌడ్**

జిన్నారం, ఆగస్టు 30, మనం న్యూస్: జిన్నారం మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఎడాపెడా విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేళా పాళా లేని విద్యుత్ కోతలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. గత రెండు మూడు నెలలుగా రోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు ప్రతి గంటకు లెక్కలేనన్నిసార్లు పవర్ ట్రిప్ అవుతుంది. తరచూ పవర్ సమస్య ఏర్పడుతుంది. దీంతో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్యను పరిష్కరించలేకపోవడంతో జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కలాల్ రాజు గౌడ్, మాదారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీతారాం యాదవ్‌లు ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ పాత హనుమాన్ దేవాలయ బస్తీలో మహిళలు ఉదయాన్నే లేవగానే కరెంటు లేకపోవడంతో వారు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, ఉద్యోగానికి వెళ్లాలన్నా, స్కూల్‌కు పిల్లలను పంపించాలన్నా , వంట చేసుకోవాలన్నా కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పాత హనుమాన్ బస్తీలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వోల్టేజ్ సరిపోక ప్రతి రోజు గ్రామ ప్రజలు కరెంటు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెల క్వాలిటీ బిల్లు



కడుతున్నము కాబట్టి మాకు క్వాలిటీ కరెంటు కావాలని ఏఈ తక్షణమే దీనిపై స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని లేదంటే సబ్‌స్టేషన్‌కు తాళం వేస్తామని, ధర్నాకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేందర్ సింగ్, కుమ్మరి కుమార్ , యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రమణసింగ్, బజరంగ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు పులిహోర ప్యాకెట్ల పంపిణీ

**-సమాజ సేవ చేయడంలో ఎంతో తృప్తి**

**-బిఆర్ఎస్ మహిళా సీనియర్**

**నాయకురాలు కామోజి అనురాధ**

దుబ్బాక, ఆగస్టు 30, మనం న్యూస్: ఎంత సంపాదించామ న్నది ముఖ్యం కాదని, సంపాదించిన దాంట్లో నుండి ఎంత పేద ప్రజలకు సేవ చేస్తే అంత సంతృప్తి లభిస్తుందని దుబ్బాక బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు కామోజి అనురాధ అన్నారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విక లాంగుల ట్రై సైకిల్ నమోదు శిబిరానికి వచ్చిన వికలాంగులకు పులిహోర ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ దివ్యాంగులకు సేవ చేయడంలో ఎంతో తృప్తిని స్తుందన్నారు. వికలాంగులకు స్థానిక అంగన్‌వాడీలు కోరిక మేరకు మధ్యాహ్నం ఆకలి తీర్చేందుకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు సంపాదించిన దాంట్లో కొంత పేద ప్రజలకు సహాయం చేయాలని, సహాయం చేస్తే ఎంతో తృప్తి ఉంటుందన్నారు. పార్టీలకు అతీతంగా పలువురు ఆపదలో ఉన్న పేదలకు, వికలాంగులకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్, జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, సిడిపిఓ చంద్రకళ, అంగన్‌వాడి వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం

**గజ్వేల్ ఆసుపత్రిలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు**

**ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సాయికిరణ్**



గజ్వేల్, ఆగస్టు 30, మనం న్యూస్: నేత్రదానం మహాదానమని, మనం చనిపోయిన తర్వాత కూడా ఇతరులకు చూపునిస్తూ వారి జీవితానికి వెలుగులనిస్తాయని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా. సాయికిరణ్ అన్నారు. బుధవారం ఆసుపత్రిలో డా. సాయికిరణ్ సమక్షంలో కంటి వైద్యులు డా. రాకేష్ సింగ్, డా. జ్యోతి ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. గతశుక్రవారం నుండి సెప్టెంబర్ 8 వరకు నేత్ర దానంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మా ట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటూ కంటి ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతి ఒక్కరు నేత్రదానం చేసి తోటి వారికి చూపు ప్రసాదించాని, మరణానంతరం కూడా జీవించి ఉండడమే కాకుండా ఒక వ్యక్తి కంటి చూపు ప్రసాదించిన వారి అవుతామన్నారు. కావున ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా వచ్చి నేత్రదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, సుమతి, వరలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాడాలి

**బిఎస్పీ జిల్లా అధ్యక్షులు కటికల ఓం ప్రకాష్**

జగదేవ్‌పూర్, ఆగస్టు 30, మనం న్యూస్: బిఆర్ఎస్ ప్రభుత్వం దళిత కులంలో దళితబంధు పేరుతో కుమ్ములాటలు పెట్టి చోద్యం చూస్తుందని, బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం కోసం పోరాడాలని బిఎస్పీ జిల్లా అధ్యక్షులు కటికల ఓం ప్రకాష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దళితబంధులో నిజమైన దళితులకు మాత్రమే కాదు ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు ఇవ్వాలన్నారు. స్వయంగా సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో దళితుల ఆందోళనలు మిన్నంటాయని, నియోజకవర్గంలోని ప్రతి దళితకుటుంబం ఇప్పటికైనా మేల్కొనాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కులం మధ్యలో కుమ్ములాటలు పెట్టిన పార్టీని క్షమించకూడదన్నారు. బహుజనులు ఏకం అయితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. బహుజనులు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రాథమిక పాఠశాలకు మైక్‌సెట్ అందించిన ఆయుర్వేదిక్ డాక్టర్



జగదేవ్‌పూర్, ఆగస్టు 30, మనం న్యూస్: మండల పరిధిలోని ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలకు ఆయుర్వేదిక్ డాక్టర్ దీపాంజలి సహకారంతో బుధవారం మైక్‌సెట్‌ను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ గుప్త, పంచాయతీ సెక్రటరీ సత్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవిందల ఆధ్వర్యంలో ఆమె పాఠశాలకు మైక్‌సెట్‌ను అందించారు. అనంతరం వైద్యురాలు దీపాంజలి మాట్లాడుతూ విద్యాదానం మహాదానమని, విద్యార్థులకు సేవ చేస్తే చాలా పుణ్యం కలుగుతుందన్నారు. సర్పంచ్ చంద్రశేఖర్ పాఠశాలను చాలా చక్కగా అభివృద్ధి చేస్తున్నారని, వారి తల్లిదండ్రులపై ట్రస్టు ఏర్పాటు చేసి పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అదే స్ఫూర్తితో తండ్రి పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.




# బీజేపి ఎస్సీ మోర్చ నియోజకవర్గ కన్వీనర్‌గా ఆకారం అశోక్



గజ్వేల్, ఆగస్టు 30, మనం న్యూస్: గజ్వేల్ బీజేపి నియోజకవర్గ ఎస్సీ మోర్చ కన్వీనర్‌గా ఆర్ అండ్ ఆర్ ఎర్రవల్లి కాలనీకి చెందిన ఆకారం అశోక్‌ను నియమించినట్లు ఎస్సీ మోర్చ అధ్యక్షులు మంగిడి స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆకారం అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు ఈ పదవి వచ్చినందుకు బీజేపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు మంకిడి స్వామి, జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, అసెంబ్లీ కన్వీనర్ సాయి, ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షులు మన్నెం శేఖర్‌రెడ్డి, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి శివకుమార్, గజ్వేల్ నియోజకవర్గ బీజేపి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నా న్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

# దుబ్బాకలో బిఆర్ఎస్ గెలుపు ఖాయం

## బిఆర్ఎస్ నాయకులు దండోరా శివరాజ్

దౌల్తాబాద్, ఆగస్టు 30, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో దుబ్బాక నియోజకవర్గంలో గెలిపిస్తాయని బిఆర్ఎస్ నాయకులు దండోరా శివరాజ్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిజేపి నాయకులు మాయమాటలు చెప్తూ మళ్లీ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపిలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. బీజేపి ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ఆయన ప్రశ్నించారు. దుబ్బాకలో ఎంపి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను తానే చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి దుబ్బాకలో అభివృద్ధి జరగలేదని గ్రామాల్లో చెప్పుకుంటూ యాత్ర చేస్తుంటే జరిగిన అలభివృద్ధి కనబడడం లేదా అన్నారు. బిఆర్ఎస్



హయాంలోనే దుబ్బాక అభివృద్ధి చెందిందని, వచ్చే ఎన్నికల్లో దుబ్బాక గడ్డపై బిఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండా అని, గెలించి కొత్త ప్రభాకర్‌రెడ్డి అని ధీమా వ్యక్తం చేశారు.

## గొల్లకురుమల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్



సంగారెడ్డి, ఆగస్టు 30, మనం న్యూస్ః గొల్లకురుమల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టిఎస్‌హెచ్‌డిసి ఛైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. బుధవారం సదాశివపేట మండల పరిధిలోని 12 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ గొల్లకురుమల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పట్టణ గొల్లకురుమ సంఘం ప్రధాన కార్యదర్శి పాపరాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గొల్లకుర్మల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. గొల్లకుర్మలు ఎల్లప్పుడూ చింత ప్రభాకర్‌కు తోడుగా ఉంటారని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతోగెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ చింతా గోపాల్, క ౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, నాయకులు సోము తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు లేక దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

**-రైతులకు ఎకరాకు రూ .30 వేల పరిహారం అందించాలి**

**-కేరింగ్ కలెక్టివ్ జిల్లా కో ఆర్డినేటర్ అందె ప్రవీణ్**



మిరుదొడ్డి, ఆగస్టు 30, మనం న్యూస్ః వర్షాలు పడకపోవడంతో ఆరుగాలం కష్టించి పంట వేసిన రైతులు పంటలు ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని కేరింగ్ సిటిజెన్స్ కలెక్టివ్ జిల్లా కో ఆర్డినేటర్ అందె ప్రవీణ్ అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వర్షాకాలం ఆలస్యంగా పత్తి, మొక్కజొన్న పంటలు వేయడంతో వారికి కన్నీళ్లే మిగిలాయన్నారు. గత నెల రోజుల నుండి వర్షాలు లేకపోవడంతో మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా ఎండిపోయి పూత, ఖాత ఏదీ లేదని రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. పెట్టిన పెట్టుబడులు ఎక్కువై, వేసిన పంట పూర్తిగా ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. పత్తి, మొక్కజొన్న వేసిన రైతులు ఇన్సూరెన్స్ కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు రైతుబీమా మాదిరిగా పంటబీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. పత్తి, మొక్కజొన్న వేసిన రైతులకు ఎకరాకు రూ. 30 వేల చొప్పు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు యాదయ్య, రామాగౌడ్, శంకరయ్య, నాగరాజు, సుమన్‌తోపాటు తదితరులు ఉన్నారు.



## గజ్వేల్‌లో ప్రతిపక్షాలకు స్థానం లేదు

### మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి

గజ్వేల్, ఆగస్టు 30, మనం న్యూస్ః 60 ఏండ్ల అభివృద్ధి పదేళ్లల్లో సాధించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని, సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి గజ్వేల్ ఎమ్మెల్యేగా లక్ష మెజార్టీతో గెలవడం ఖాయమని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గజ్వేల్ రూపురేఖలు మార్చారని, గజ్వేల్ నియోజకవర్గం 60 ఏళ్ల అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో లక్ష మెజార్టీతో గెలవడం ఖాయమని, మున్సిపల్ ప్రజలంతా కేసీఆర్‌కు అండగా ఉంటారని మున్సిపల్ పాలకవర్గం ఆద్వర్యంలో సీఎం కేసీఆర్ గజ్వేల్‌లో భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందన్నారు. అనునిత్యం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్ధతుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జకీయొద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్‌లు చందన, బాలమణి, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బిఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం



జగదేవ్‌పూర్, ఆగస్టు 30, మనం న్యూస్ః ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సేవెళ్ల రాములు కుటుంబాన్ని సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ సహకారంతో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు నర్సోళ్ల స్వామి, గ్రామ ఉప సర్పంచ్ చిగురుపల్లి రమేష్‌లు వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 3 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తమకు తోచిన విధంగా సహాయపడుతున్న సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కరకపట్ల కనకరాజు, నర్సింహా, గణేష్, తుమ్మ బాబు, హేమంత్, ప్రవీణ్, ఎల్లోల స్వామి, వెంకటేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

### బహుజన సేన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు





సంగారెడ్డి, ఆగస్టు 30, మనం న్యూస్ః ప్రభుత్వం సెకండ్ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని బహుజన సేన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు అన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు సెకండ్ ఏఎన్ఎంల ధర్నాకు బుధవారం తెలిపి మాట్లాడారు. గత 15 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తూ తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను మంత్రి హరీష్‌రావు తక్షణమే చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎన్ఎంలను నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం మంచి పద్ధతి కాదని, నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదహారేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో వైద్య శాఖలో పని చేస్తున్న ఎన్ఎన్ఎంలను ప్రభుత్వం చర్చలకు పిలవాలని, వారి సమస్యలు పరిష్కరించకుంటే బహుజనసేన ఆధ్వర్యంలో సమ్మెను ఉధృతం చేసి అన్ని విధాలుగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి బోయిన్ ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు శ్యామల, ఏఎన్ఎంలు శ్యామలత, సుజాత, చంద్రకళ, సుక్కమ్మ , మంజుల, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి టెక్నో స్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 30, మనం న్యూస్ః రక్షాబంధన్ దేశవ్యాప్తంగా జరుపుకునే పండుగ అని శ్రీవాణి పాఠశాల కరస్పాండెంట్ సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్ శ్రీవాణి టెక్నో స్కూల్‌లో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు రాఖీలు కట్టి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ విద్యార్థి





దశ నుంచే పండుగలపై గొప్పతనాన్ని చాటేల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తద్వారా భవిష్యత్ తరాలకు మన పండుగల ప్రాముఖ్యతను తెలుపవచ్చన్నారు. నేను మీకు రక్ష,నీవు నాకు రక్ష, మనందరం దేశానికి రక్ష అంటూ విద్యార్థులు దేశభక్తిని చాటేలా రాఖీలను కట్టుకున్నారు.